క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శంకర జయంతి

కడప కల్చరల్: మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ ఆదిశంకరాచార్యుల మఠంలో మంగళవారం శంకరజయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి మూలమూర్తికి అర్చకులు ఆలూరి రవిశంకర్‌శాస్త్రి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం చేసి కనుల పండువగా పూలతో అలంకరించారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో విశేష పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● కేంద్ర కారాగార సమీపంలోని శ్రీ సర్వేశ్వర మహర్షి ఆశ్రమంలో విశేష పూజాధికాలు నిర్వహించారు. ఆశ్రమ ఆవరణలోని శ్రీ రాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు.శ్రీ సర్వేశ్వర మహర్షి విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

భాషాబోధకుల శ్రేయస్సే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్: భాషల, భాషాబోధకుల శ్రేయస్సే పండిత పరిషత్తు లక్ష్యమని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అన్నారు. మంగళవారం కడపలోని సంఘ కార్యాలయంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జిల్లా అధ్యక్షులు ఎస్ఎంఎస్ ఖాదర్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. అనంతరం సంఘ శ్రేయస్సు కోసం కృషి చేసిన విశ్రాంతి హిందీ ఉపాధ్యాయులు, సత్యనారాయణ, పద్మనాభయ్య, రామారావు, పర్వీన్‌లను సన్మానించారు.

వేసవి వ్యాధులపై అప్రమత్తత అవసరం

కడప కల్చరల్: వేసవిలో పలు వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదముందని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో జరుగుతున్న టెన్త్ క్లాస్ స్పాట్ వాల్యూయేషన్‌లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్ ఆధ్వర్యంలో ఉప విద్యాశాఖాధికారి ద్వారా రాజగోపాల్ రెడ్డి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులకు తెలిపేందుకు ఈ కరపత్రాన్ని వేయించిన జన విజ్ఞాన వేదిక ప్రతినిధులను అభినందించారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడారు. సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటేశ్వర్లు, విద్యా విభాగం సబ్ కమిటీ కన్వీనర్ రూత్ ఆరోగ్యమేరి, ఎగ్జిబిషన్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, గంగాధర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న పోతుల కుటుంబ సభ్యులు

కడప కల్చరల్ : కడప నగరానికి పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్‌రెడ్డి, సరస్వతమ్మ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పోతుల వెంకట్రామిరెడ్డి తన సతీమణి సరస్వతమ్మ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఉదయం ఏడురోడ్లకూడలిలోగల ట్రస్టు కార్యాలయంలో శాంతి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. అలాగే పేద మహిళలకు చీరలు, కుట్టుమిషన్ పంపిణీ చేశారు. ప్రకాశ్‌నగర్‌లోని అర్బన్ బాయ్స్ హాస్టల్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య, పోతుల వెంకట్రామిరెడ్డితోపాటు కుటుంబ సభ్యులు వైఎస్ వెంకటరెడ్డి, ఉమామహేశ్వరి, బాల వెంకటరెడ్డి, కొండూరు జనార్దన్ రాజు పాల్గొన్నారు.

కేజీ సెట్ 2కే23 రిజిస్ట్రేషన్‌కు 30 వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి రాయలసీమ జిల్లాల నుంచి ఇంజనీరింగ్ విద్యలో చేరబోయే విద్యార్థులకు కందుల గ్రూపు ఆఫ్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (కేజీసెట్ -2కే23)కి ఈ నెల 30 వరకు గడువు ఉందని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీసెట్-2కే23 దరఖాస్తు ఉచితం అని www.ksrmce.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 1,2,3,4 తేదీలలో రోజుకు రెండు విడతల్లో కళాశాలలో ఆన్ లైన్ విధానంలో పరీక్ష నిర్వహణ ఉంటుందన్నా రు. ఈ కేజీ సెట్ పరీక్షలో టాప్ నాలుగు ర్యాంకులలో మొదటిర్యాంకు సాధించిన విద్యార్థికి బిటెక్ నాలుగేళ్లు ఉచిత విద్యతోపాటు వసతిని కల్పిస్తామని అన్నారు. అలాగే రెండవ ర్యాంకు సాధించిన వారికి కూడా కందుల గ్రూపు విద్యాసంస్థల్లో ఉచిత విద్యతో పాటు వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 9849777831, 9494246147 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎండిపోతున్న ‘పెన్నా’

● ఇలాగే కొనసాగితే మేలో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే అవకాశం
● ముందస్తు చర్యలు అవసరం



చెన్నూరు వద్ద పెన్నానదిలో అడుగంటి పోతున్న నీటి జాడ

కడప కార్పొరేషన్: ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్న వేళ...ప్రధాన జలాశయాలతోపాటు నదుల్లో కూడా నీరు అడుగంటిపోతోంది. ముఖ్యంగా కడప నగరానికి ప్రధాన తాగునీటి వనరయిన పెన్నా నదిలో రాను రాను నీటి జాడ ఆవిరైపోతోంది. ఇలాగే కొనసాగితే మే మాసంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఖరీఫ్ పంటలకు పెరిగిన నీటి వినియోగం, వర్షాభావం, ఎల్‌నినో ప్రభావం కారణంగా జలాశయాల్లో నీటి నిల్వలు గత ఏడాది కన్నా 5 శాతం తక్కువగా ఉన్నాయని కేంద్ర జల సంఘం పేర్కొంది. పెన్నానదిలో నీరు కాస్త ప్రవహిస్తున్నప్పుడే నీటిని విడుదల చేస్తే సాఫీగా కిందికి వచ్చే అవకాశముంది. అలాకాకుండా పూర్తిగా ఎండిపోయిన తర్వాత విడుదల చేస్తే నీరు ఇసుకలో ఇంకిపోతూ, ఆవిరవుతూ అన్ని ప్రాంతాలు చేరుకోవడానికి చాలా రోజులు పట్టే అవకాశముంది. ఇప్పటికే పెన్నానదికి మైలవరం జలాశయం నుంచి ఒకసారి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నీరు ఆవిరవడంతో మళ్లీ వదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఈ దిశగా ఆలోచన చేయకపోతే మేలో నీటి కోసం ఇబ్బందులు పడక తప్పదు. ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మలమడుగు, కడప, రాజంపేట, బద్వేల్‌లోని ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు పెన్నా నీటిపై ఆధారపడి ఉన్నారు.

● కడప నగరానికి ప్రధానంగా లింగంపల్లి, గండి వాటర్ వర్క్స్‌ల ద్వారా సుమారు 52ఎంఎల్‌డీల నీరు సరఫరా అవుతోంది. వేసవి కాలంలో కాస్త తక్కువగా సరఫరా కావడం పరిపాటిగా మారింది. గతంలో వేసవిలో కాలంలో లింగంపల్లి, గండి వద్ద ఇసుకమూటలు అడ్డుగా వేసి నీటిని నిల్వ ఉంచి తాగునీటికి సమస్యలు రాకుండా చర్యలు తీసుకునేవారు. గతంలో ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన టీడీపీ జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలపై ఎప్పుడూ దృష్టి సారించలేదు. లింగంపల్లి వద్ద పెన్నానదిలో సబ్ సర్ఫేజ్ డ్యామ్ నిర్మించాలని రూ.75కోట్లతో ప్రతిపాదించినా అవి టెండర్ల దశకు కూడా చేరుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నందున పెద్దగా నీటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. బ్రహ్మం సాగర్ నుంచిగానీ, సోమశిల బ్యాక్ వాటర్‌నుగానీ కడపకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నదు లు, వంకలు, వాగుల్లో నీటి నిల్వలు పూర్తిగా పడిపోయాయి. నీటి సమస్య ఉత్పన్నమైతే కడపలో పాత మున్సిపాలిటీలోని ప్రాంతాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. బుగ్గవంక పరిధిలోని ప్రాంతాల్లో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఆ పరిస్థితి రాకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉంది.

వైభవంగా శ్రీ భద్రావతి భావనా ఋషి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్ప వీధిలోని శ్రీ భద్రావతి భావనా ఋషి ఆలయంలో మంగళవారం భావ నారాయణునికి, భద్రావతి దేవికి ఈ కల్యాణం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణం, మూలవర్లకు కల్యాణ మూర్తులుగా విశేష అలంకారం చేసి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చాటనల మధ్య కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర నామ పారాయణం, కుంకుమార్చన చేశారు. రాత్రి కల్యాణమూర్తులను వీధుల్లో పల్లకీపై ఊరేగించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సమాజ హితమే.. ఎన్ఎస్ఎస్ లక్ష్యం



సర్టిఫికెట్లతో వలంటీర్లు

వైవీయూ: సమాజ హితమే జాతీయ సేవాపథకం లక్ష్యమని వైవీయూ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు పేర్కొన్నారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ క్యాంపు ముగింపు కార్యక్రమం మంగళవారం వైవీయూలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఉన్నప్పటికీ ఉత్తమ సేవలందించారని అభినందించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎస్. వెంకట్రామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. సరిత, పీఆర్ సెల్ డైరెక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డి, అమృత్‌ప్రసాద్‌లు మాట్లాడారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో..

నిరంజన్ నగర్‌లో కడప ప్రభుత్వ పురుషుల కళాశాలఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు.ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో స్థానికులకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

సోషల్ ఆడిట్ తప్పనిసరి



మాట్లాడుతున్న కడప ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్: ప్రతి పాఠశాలలో సోషల్ ఆడిట్‌ను స్కూల్ పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ టూల్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కడప, సీకేదిన్నె ఎంఈఓలు నారాయణ, వెంకట్రామిరెడ్డి సూచించారు. మంగళవారం కడప స్కౌట్ హాల్‌లో కడప, సీకే దిన్నె మండలాలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులకు, ప్రధాన టీచర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరల్డ్ బ్యాంకు ఆంధ్రప్రదేశ్‌తో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా స్కూల్ పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ టూల్‌లో తల్లితండ్రుల కమిటీ సభ్యులు చేత ఈ సోషల్ ఆడిట్‌ను నిర్వహించాలని సూచించారు. సమగ్రశిక్ష కమ్యూనిటి మొబిలైజేషన్ ఆఫీసర్ మిట్టా కేశవరెడ్డి, అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ ధనలక్ష్మి, అసిస్టెంట్ కమ్యూనిటి మొబలైజేషన్ ఆఫీసర్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఈ సోషల్ ఆడిట్ సరిగా నిర్వహిస్తే పాఠశాల స్థితిగతులను అంచనా వేయవచ్చని, ప్రభుత్వం చేయవలసిన మరిన్ని పథకాలను అమలు పరుచుటకు ఒక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్స్ రవికిరణ్, సురేష్ ఆడిట్ విధానాన్ని ఉపాధ్యాయులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు, హెడ్ టీచర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు వెంకట శివ, రామ్మోహన్ విమర్శించారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో ప్రచార భేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్, పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నాం చేస్తోందని మండిపడ్డారు. దేశంలో వివిధ రాజకీయ పార్టీలపైన దళితులు, మైనార్టీలపై కక్ష పూరితంగా దాడులు చేస్తూ అధికారం చెలాయిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ఈ నెల 29న నగరంలో నిర్వహించనున్న ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ, సీపీఎం నాయకులు మద్దిలేటి, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర పిలుపులో భాగంగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం ఈపీఎఫ్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు రీజియన్ల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ జాయింట్ ఆప్షన్ల విషయంలో జరుగుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. దరఖాస్తుల గడువును మూడు నెలలు పెంచాలని కోరారు. ఈపీఎఫ్ కార్యాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో జెఎంఆర్ నాయుడు, ఎంపీ నారాయణ, ఎస్ఎస్ రావు, రామిరెడ్డి, వై.రాజారెడ్డి, రవీంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

వైవీయూ : ఆరోగ్యంగా ఉన్న యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కడప ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసులు కోరారు. మంగళవారం నగరంలోని ఐటీఐ సర్కిల్‌లో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్ఐ మాట్లాడుతూ వేసవిలో రక్తకొరత నివారించేందుకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.22 మంది రక్తదానం చేశారు. పట్టుపోగుల పవన్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పింఛన్ పథకం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: తమకు ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు కోరారు. ఈ విషయమై మంగళవారం స్పాట్ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి గంగాధర్, విజయ్‌కుమార్ తదితరులు కోరారు. అనంతరం వారు వినతిపత్రమిచ్చారు. సోషియల్ సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై మంగళవారం సోషియల్ టీచర్స్‌తో కలిసి ఎమ్మెల్సీకి వినతిపత్రమిచ్చారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆర్తిహోం ద్వారా 7–15 ఏళ్లలోపు విద్యార్థులకు వారిలోని విద్య, సంగీతం, నాట్యం, చిత్రకళ, తెలుగు, ఆంగ్లం, జెర్మన్ వంటి భాషలకు సంబంధించి క్రీడా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్రాసు రోడ్డులోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో మే 1వ తేది నుంచి జూన్ 15వ తేది వరకూ క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నీస్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అలాగే నగరపాలక గాంధీనగర్ ఉన్నతపాఠశాలలో సంగీతం, భరత నాట్యం, బాలీవుడ్ డ్యాన్స్, జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డ్రాయింగ్, పెయింటింగ్, ఒరిగామి, పాట్టేరి, టెర్రకోట్ట, జ్యువెల్లరీ తయారీలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. చెమ్ముమియ్యాపేట జెడ్పీ హైస్కూల్‌లో జూడో, కరాటే వంటి ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ ఈ సమ్మర్ క్యాంపులు నిర్వహించబడుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాల్గొనదలిచిన వారు మున్సిపల్ స్టేడియం సమీపంలోని ఆర్తి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో రూ.500 చెల్లించి రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనేవారు తమ ఆధార్, ఐడీ కార్డు తీసుకురావాలని సూచించారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్: కడప నగర పరిధిలోని మాంట్‌ఫోర్ట్ పాఠశాల ఆవరణలో మే 1 నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు నిర్వాహకుడు, ఎన్ఐఎస్ కోచ్ దేవ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు 8 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్, చెస్, హ్యాండ్ బాల్, ఫిట్‌నెస్, ఫుట్‌బాల్, త్రోబాల్, వాలీబాల్, మార్షల్‌ఆర్ట్స్, రెజ్లింగ్, టెన్నికాయిట్, కరాటే, మెడిటేషన్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉపాధి పని దినాలు పెంచాలి

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనిదినాలను 150 నుంచి 200 రోజులకు పెంచాలని డిమాండ్‌చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బీసీ గంగులు, ఆంజనేయులు, కర్ణ, యల్లయ్యలు మాట్లాడుతూ కూలీలకు కష్టానికి తగ్గ వేతనం అందడం లేదని చెప్పారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి జీవనం కష్టతరంగా మారిందన్నారు. వేసవిలో పనిచేసే ఉపాధి కూలీలకు కేంద్రప్రభుత్వం జారీ చేసిన జీఓ మేరకు అన్ని రకాల వసతులు కల్పించి సమయ పాలనతో కూడిన పనిచేయించుకోవాలని కోరారు. ఒక్కో కూలీకి దినసరి వేతనం కింద రూ. 500 చెల్లించాలన్నారు. డప్పు కళాకారుల సంఘ కన్వీనర్ నాగభూషణం, ఓబులేశు, సుబ్బరాయుడు, రమణ, రామయ్య పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించి ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలన్నారు. వీరికి ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఫిబ్రవరి నెలలో నూతనంగా ఎన్నికైన 68 మంది ఆశా వర్కర్లకు రెండు నెలలుగా వేతనం ఇవ్వలేదని వారికి తక్షణమే వేతనాలను చెల్లించాలన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజామణి, నాయకురాళ్లు నాగలక్ష్మీ, లక్ష్మీ ప్రసన్న, స్వర్ణలత పాల్గొన్నారు.

అడ్మిన్‌కు అభినందన

కడప కల్చరల్ : కడప నగరం 29వ డివిజన్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శి టి.గణేష్ వెంకట శివతేజను మంగళవారం మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్ ద్వారా ఉత్తమ అడ్మిన్ సర్వీస్ అవార్డు పొందినందుకు ఆయనకు ఈ సత్కారం చేశారు. స్థానిక కార్పొరేటర్ ఎస్ఎండీ రిజ్వాన్, సిబ్బంది పాల్గొన్నారు.

షాపురూముల బాడుగ పెంపుదల

● నగరపాలక స్టాండింగ్ కమిటీ తీర్మానం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని టీబీ కాంప్లెక్స్‌లో ఉన్న 20 షాపు రూములు, వైఎస్సార్ కాంప్లెక్స్‌లోని 19 షాపు రూములు, బాలాజీ కాంప్లెక్స్‌లోని రూముల లీజుదారులకు 33.3 శాతం బాడుగ పెంచుతూ నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మంగళవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని పనిచేయాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. టౌన్‌ప్లానింగ్‌లో టీపీఓ రామారావు వైఖరిపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగపాలక సంస్థలో శానిటేషన్ నిర్వహణలో ఉన్న 260 మంది లోడర్స్, వర్కర్ల కాలపరిమితి ముగిసినందున రోజుకు రూ.400 కూలితో 5 శాతం ఏజెన్సీ కమిషన్‌తో ప్రభుత్వ నిబంధనలకు లోబడి కాలపరిమితి పొడిగింపునకు ఆమోదం తెలిపారు. నగరంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న ప్రకటనల బోర్డులకు సంబంధించి రెండేళ్ల కంటే ఎక్కువ కాలపరిమితి ఉన్న ఏజెన్సీల లీజులను రద్దు పరిచి కొత్తగా లీజు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. 25 ఏళ్ల లీజు కాలపరిమితి పూర్తి అయిన షాపు రూములకు సంబంధించి బకాయిలు ఉన్న బాడుగలను ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజుల కింద పరిగణిస్తూ లేదా 108 నెలలకు జరిమానాలను విధించి షాపు రూముల లీజుదారులందరికీ నోటీసులిచ్చి వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం. సుబ్బారెడ్డి, వి. శిరీష, మేసా ప్రమీలరాణి, హైమవతి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సంజీవ్‌కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ నారాయణస్వామి, ఎంహెచ్ఓ ప్రశాంత్‌వర్ధన్, ఆర్ఓలు విజయ్‌భాస్కర్ గౌడ్, కన్నయ్య పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

● ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కమలాపురం : బాగున్నారమ్మా.. మీకు ఏమైన సమస్యలుంటే చెప్పండమ్మా... నా వెంట అధికారులందరూ ఉన్నారు. ప్రభుత్వం అంతా మీ ఇంటి ముందు ఉంది.. మీ సమస్యలు పరిష్కరించడానికే వారంతా నా వెంట వచ్చారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి నల్లింగాయపల్లె గ్రామ ప్రజలతో అన్నారు. మంగళవారం మండలంలోని నల్లింగాయలపల్లెలో సర్పంచ్ హైమావతి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే ఉన్న అధికారులతో ఆ సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందన్నారు. దాదాపు 80 శాతం ప్రజలు జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని కొనియాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా క్లీన్ స్వీప్ చేయడం ఖాయం అన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు రాజయకీయ నాయకుడిగా భావించడం లేదని, కేవలం వారి కుటుంబ సభ్యుడిగా భావించడం వల్లనే 51 శాతం ఓట్లతో 151 సీట్లు ఇచ్చారన్నారు. తిరిగి 80 శాతం ఓట్లతో అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. చంద్రబాబు గతంలో వేల హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారన్నారు. దళితుల పట్ల ఎప్పటికి చిన్న చూపే చూస్తున్న చంద్రబాబును ఈ సారి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని, ఇక టీడీపీ బంగాళా ఖాతంలో కలవడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ హైమావతి, ఎంపీటీసీ ప్రియాంక, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామలక్ష్మీరెడ్డి, కొండారెడ్డి, పుల్లారెడ్డి, మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల సెల్ఫీ ఛాలెంజ్ హాస్యాస్పదం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, నిత్యానందరెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: అభివృద్ధి చేయడమంటే సెల్ఫీ దిగినంత ఈజీ కాదని డిప్యూటీ మేయర్లు బి. నిత్యానందరెడ్డి, ముంతాజ్‌బేగం అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కడపలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలని టీడీపీ నేత శ్రీనివాసుల రెడ్డి సెల్ఫీ ఛాలెంజ్ విసరడం హాస్యాస్పదమన్నారు. కడప నగరం అభివృద్ధి చెందిందంటే దివంగత వైఎస్సార్ హయాంలోనే జరిగిందని, ఆ తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో జరుగుతోందన్నారు. రవీంద్రనాథ్‌రెడ్డి మేయర్‌గా ఉన్నప్పుడు రూ.1900కోట్లతో వైవీయూ, కలెక్టరేట్, రిమ్స్, శిల్పారామం, రోడ్ల విస్తరణ, బుగ్గవంకపై బ్రిడ్జిలు, బుగ్గవంక సుందరీకరణ, స్పోర్ట్స్ స్కూల్ వంటి అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో నగరంలో సుమారు రూ.600కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. కడప నగరంలోని మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్‌కు వెళ్లేదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి వరకూ, ఎర్రముక్కపల్లె నుంచి రైల్వే స్టేషన్ వరకూ రూ.100కోట్లతో రహదారులు నిర్మించామన్నారు. రవీంద్రనగర్ బ్రిడ్జిని తామే నిర్మించామని శ్రీనివాసులరెడ్డి గొప్పలు చెప్పుకోవడం దారుణమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఆ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోతే మేయర్ సురేష్ బాబు, అంజద్‌బాషా ప్రత్యేక చొరవ తీసుకొని కార్పొరేషన్ నిధుల నుంచి దానిని పూర్తి చేయించారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే నీరు–చెట్టు ద్వారా తెలుగు తమ్ముళ్లకు మాత్రమే జరిగిందని ఎద్దేవా చేశారు. రేపటి నుంచి శ్రీనివాసరెడ్డికి గుడ్‌మార్నింగ్ పేరుతో రోజుకొక సెల్ఫీ పంపిస్తామని, సెల్ఫీ కొట్టి సెల్ఫ్ గోల్ వేసుకోవడం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. కార్పొరేటర్ షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్, రెడ్డి ప్రసాద్, ఎస్. సుబ్బారెడ్డి, అజ్మతుల్లా పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కడప కార్పొరేషన్: కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అన్నారు. ప్రతి కార్మిక కుటుంబం సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కార్మికులు అండగా నిలవాలని కోరారు. మే ఒకటోతేది నిర్వహించే కార్మిక దినోత్సవ సందర్భంగా ప్రతి ఆటో స్టాండ్‌లో జెండాలు ఎగురవేయాలన్నారు. వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు నాగరాజు, అనుబంధ సంఘాల నాయకులు నరసింహా, చంద్రశేఖర్‌రెడ్డి, రాజా, షేర్‌ఖాన్, వలీ, శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కడప రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ కోరారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆర్ఎన్ రాజా అధ్యక్షతన ఎస్.రామాంజనేయులు సహకారంతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 30 ఏళ్లుగా మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ డిమాండుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేపట్టి ఉద్యమాలకు సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జిగా ఆర్ఎన్ రాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాదిగ జేఏసీ జిల్లా కన్వీనర్ ఓబులపతి, నాయకులు మునెయ్య, ఆంజనేయులు,భాస్కర్, నాగరాజు, నాగేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను వేధించడం మానుకోకపోతే విద్యాశాఖ అధికారులు మూల్యం చెల్లించకోక తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కడప జిల్లా సెక్రటరీ జనరల్ మహమ్మద్ ఇర్షాద్ అన్నారు. పాఠశాలల సందర్శన పేరుతో పాఠశాల ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం, వేధించడం నిరసిస్తూ మంగళవారం మధ్యాహ్నం కడప స్పాట్ కేంద్రం వద్ద నల్లబాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ తీరు విద్యావ్యవస్థని నిర్వీర్యం చేసే విధంగా ఉందని విమర్శించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఇలియాస్ బాష, బాలగంగిరెడ్డి మాట్లాడారు.

ఏపీ జేఏసీ నాయకుల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్: మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఏపీ జేఏసీ అమరావతి నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ జిల్లా కార్యదర్శి కృష్ణకుమార్, ఏపీటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జేఏసీ అమరావతి వైస్ చైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించాలని కోరారు. 11వ పీఆర్సీ ప్రతిపాదించిన స్కేల్స్ వెల్లడించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ అరియర్స్‌లను చెల్లించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ డ్రైవర్స్ సంఘం రాష్ట్ర నాయకులు కొండయ్య, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘ నాయకులు దివాకర్ పాల్గొన్నారు.